
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

బుధవారం 25 సెప్టెంబరు 2024

కూతురికి అత్తింటి వేధింపులు..
• బావిలో దూకి తండ్రి బలవన్మరణం 7లో..

8లో.. దేశాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలి

బడి ఆవరణలో ఖాళీ బీరు సీసాలు

- పాఠశాలను సందర్శించిన డీఈవో



పాఠశాల ఆవరణలో పడి ఉన్న ఖాళీ మద్యం సీసాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 24: ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ మందుబాబులకు అడ్డాగా మారింది. బడి ఆవరణలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మద్యం తాగి ఖాళీ సీసాలను అక్కడే పడేశారు. మంగళవారం ఉదయం పాఠశాలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు చేరుకునే సరికి తరగదుల ఆవరణలో ఐదు ఖాళీ బీరు సీసాలు కనిపించాయి. దాంతో హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పాఠశాలకు చేరుకున్న పోలీసులు పరిశీలించారు. పాఠశాలకు ప్రధాన గేటు లేకపోవడం వల్ల తరచూ మందుబాబులు మద్యం తాగుతున్నారని ఉపాధ్యాయులు, స్థానికులు, విద్యార్థులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న డీఈవో రమేశ్‌కుమార్ పాఠశాలను సందర్శించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. బడిలోని వసతులపై ఆరా తీశారు. విద్యార్థుల ప్రగతిని తెలుసుకున్నారు. బడిలో మద్యం తాగుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో రమేశ్‌కుమార్



సన్నాలపై మక్కువ

- ఈ సీజన్ నుంచే క్వింటాలుకు రూ. 500 బోనస్
- సన్నరకం 16,300 ఎకరాలు
- దిగుబడి అంచనా 34,230 మెట్రిక్ టన్నులు
- రైతులకు రూ 17.11 కోట్ల అదనపు లబ్ధి
- వచ్చేనెల రెండో వారం నుంచి కొనుగోళ్లు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

వానాకాలం పంటల సాగులో అన్నదాతలు వరి వైపే మొగ్గు చూపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో గతంలో పత్తి సాగునే ప్రధానంగా భావించినా రైతులు సమృద్ధిగా కురుస్తున్న వర్షాలు, ప్రాజెక్ట్‌లోకి నీళ్ల, భూగర్భ జలాల పెరుగుదలతో పత్తి సాగు సగానికి పడిపోగా వరి రికార్డు స్థాయిలో పండిస్తున్నారు. ధాన్యం దిగుబడి రైతులకు ఆశాజనకంగానే మారింది. ప్రస్తుత వానాకాలం సీజన్ నుంచే ప్రభుత్వం సన్నరకం వరి ధాన్యానికి మద్దతు ధరపై 500 రూపాయలు బోనస్ ఇస్తామని ప్రకటించడంతో జిల్లాలో కొంత మేరకు రైతులు సన్నరకం సాగుపై ఆసక్తి చూపారు. జిల్లాలో కేవలం దొడ్డురకం మాత్రమే రైతులు పండించేవారు ఈసారి బోనస్ రైతుల్లో జోష్‌ను నింపిందని చెప్పుకోవచ్చు. జిల్లాలో వానాకాలం సీజన్‌లో 2.32 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో ప్రధానంగా వరి 1.80 లక్షల ఎకరాలు, పత్తి 49,332 ఎకరాలు సాగు చేశారు. మిగతా పెసర, కందులు, ఇతర పంటలు వేసుకున్నారు.

• 258 కొనుగోలు కేంద్రాలు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో వరి 1.82 లక్షల ఎకరాల్లో సాగు చేసుకోగా సన్నరకం 16, 300 ఎకరాల్లో సాగు చేశారు. ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు 2,320 రూపాయలు, కామన్ సన్నరకానికి 2,300 రూపాయలు ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయిం చింది. సన్నర కానికి ప్రభు త్వం అదనంగా రూ 500 బోనస్ ఇవ్వనుంది. జిల్లాలో 4.37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాలు వేశారు. ఇందులో సన్న రకం 34,230 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాలు వేశారు. దీని ప్రకారం సన్నరకం పండించిన రైతులకు అదనంగా రూ17.11 కోట్లు లబ్ధి చేకూరనుంది. పౌరసరఫరాల శాఖ మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో దొడ్డురకం ధాన్యం 2,75,400 మెట్రిక్ టన్నులు, సన్నరకం 24,600 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయనుంది. అక్టోబరు రెండోవారం నుంచే కొనుగోలు చేసే దిశగా ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని 255 గ్రామ పంచాయతీలు ఉండగా 258 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయ నున్నారు. ఇందులో ఐకేపీ ద్వారా 44 కేంద్రాలు, సింగిల్‌విండోల ద్వారా 202 కేంద్రాలు, డీసీఎంఎస్ ద్వారా ఎనిమిది కేంద్రాలు, మెప్మా ద్వారా నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. కొనుగోళ్లకు సంబంధించి రైతులకు ఇబ్బందులు కలగకుండా 49.97 లక్షల గన్నీ బ్యాగులు సమకూరు స్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు 7,777, ప్యాడీ క్లీనర్లు 634, మ్యాయిశ్చరైజ్ మీటర్లు 609, వేయింగ్ మిషన్లు 766 సిద్ధం చేశారు. కొనుగోళ్ల కోసం అనుసరించాల్సిన చర్యలపై అవగాహన సమావేశాలు కూడా నిర్వహించారు.

• వరిసాగుపై ఊరట...

వానాకాలం సీజన్ ప్రారంభంలో నైరుతి వర్షాలు ముఖం చాటేసిన ఆ తరువాత తుఫాను ప్రభావంతో సమృద్ధిగా వర్షాలు పడడంతో వరి సాగుకు పూనుకున్న రైతులకు ఊరట కలిగింది. నాట్లు కొంత ఆలస్యం కావడం జరిగింది. మరోవైపు అధిక వర్షాలు దిగుబడిపై ప్రభావం చూపినా చివరకు వరిసాగు ఊరటనిచ్చిందని భావిస్తున్నారు. జిల్లాలో 1.80 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. ఇందులో గంభీరావుపేటలో 18,800 ఎకరాలు, ఇల్లంతకుంటలో 24,000 ఎకరాలు, ముస్తాబాద్‌లో 22 ,000 ఎకరాలు, సిరిసిల్లలో 4,550 ఎకరాలు, తంగళ్లపల్లిలో 19,010 ఎకరాలు, ఎల్లారెడ్డిపేటలో 16,650 ఎకరాలు, వీర్నపల్లిలో 6,800 ఎకరాలు, చందుర్తిలో 15,500 ఎకరాలు, కోనరావుపేటలో 17,850 ఎకరాలు, రుద్రంగిలో 5,500 ఎకరాలు, వేములవాడలో 5,200 ఎకరాలు, వేములవాడ రూరల్‌లో 11,150 ఎకరాలు సాగు చేశారు. వరి సాగు కొంత తెగుళ్ల, ఇతర సమస్యలు మొదలైనా ఆశాజనకంగానే దిగుబడి ఉంటుందని భావిస్తున్నారు.

'స్వచ్ఛతా హీ సేవ'పై విద్యార్థులు అవగాహన కల్పించాలి

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 24: స్వచ్ఛత హీ సేవపై విద్యార్థులు తల్లిదండ్రులతోపాటు ప్రజలకు అవగాహన కల్పించాలని సిరిసిల్ల మున్సిపల్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ రఘు కోరారు. దేశ వ్యాప్తంగా అక్టోబరు 2వ తేదీవరకు నిర్వహిస్తున్న స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాల్లో భాగంగా సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగ ళవారం విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ మానవహారం చేయించారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ స్వచ్ఛతపై చాలా కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని అన్నారు. వాటిలో చాలా కార్యక్ర మాలను పాఠశాలలోనే నిర్వహిస్తున్నామన్నారు. వీటిపై విద్యార్థులు తల్లిదండ్రులతోపాటు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. హెచ్‌ఎం లోకిని శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, వికాస్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ గుగ్గిళ్ల జగన్‌గౌడ్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లో మంగళవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా వికాస్ డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ అదేశాల మేరకు కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో వలంటీర్లు పిచ్చిమొక్కలు ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మధు, ఎల్లం, లత, వనజ, తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాజన్నపేటలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో 'స్వచ్ఛత హీ సేవా' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామంలో తడి, పొడి చెత్తసేకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛతపై వివరించి ప్రతిజ్ఞ చేయించారు. రహదారికి ఇరువైపుల మొక్కలను నాటారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి మంచినీటి సహాయకులకు శిక్షణ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 24: ఎల్లారెడ్డిపేట మండల పరిషత్తు కార్యాలయంలో ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో పని చేస్తున్న గ్రామీణ మంచి నీటి సహాయకులకు శిక్షణ తరగతులను బుధవారం నిర్వహించనున్నామని మిషన్ భగీరథ సహాయక ఇంజనీర్ సంతోష్ ఓ ప్రకటనలో తెలిపారు.

గ్రామాల్లో నెలకొన్న నీటి సమస్యల పరిష్కారంపై అవగాహన కల్పించనున్నామని పేర్కొన్నారు. నీటి సహాయకులు హాజరై విజయవంతం చేయాలని ఏఈ సంతోష్ కోరారు.

మైనార్టీ విద్యాసంస్థల్లో ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు

సిరిసిల్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న ఔట్ సోర్సింగ్, గెస్ట్ ఫ్యాకల్టీల పద్ధతిలో ఖాళీల భర్తీ ప్రక్రియ చేపట్టారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఇంటర్వ్యూలు నిర్వహించారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మైనార్టీ విద్యాసంస్థలో జూనియర్ లెక్చరర్స్ ఇంగ్లీష్, పీజీటీ మ్యాథ్స్, టీజీటీ మ్యాథ్స్, టీజీటీ సైన్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీలో ఖాళీలకు దరఖాస్తులను ఆహ్వానించి ఒక్కో పోస్టుకు మెరిట్ ప్రకారం ఆరుగురు అభ్యర్థులను పిలిచి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలకు 48 మందిని అహ్వానించగా 38 మంది హాజరయ్యారు. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఇంటర్వ్యూల్లో ఆర్‌ఎల్‌సీ రాజేందర్, డిస్ట్రిక్ ఇన్‌చార్జి మైనార్టీ అధికారి రాధాబాయి, ఓఎస్‌డీ సర్వర్‌మియా, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, ఫాతిమా పాల్గొన్నారు.

ఓటరు నమోదు కట్టుదిట్టంగా నిర్వహించాలి

- ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 24: జిల్లాలో ఓటర్ నమోదు కార్యక్రమం కట్టుదిట్టంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ముఖ్యఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ వారం రోజులుగా నూతన ఓటర్ నమోదుపై చేపట్టిన ఇంటింటి సర్వే పనితీరు చాలా మెరుగుపడిందని, ఇప్పటి వరకు 90 శాతం పైగా ఇంటింటి సర్వే పూర్తయిందన్నారు. సెప్టెంబరు 28 నాటికి ప్రతీ పోలింగ్ కేంద్రం పరిధిలో బూత్ స్థాయి అధికారుల ద్వారా వందశాతం ఇంటింటి సర్వే పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్ ఉన్న ఓటర్ నమోదు సంబంధించిన దరఖాస్తులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. సెప్టెంబరు నెలాఖరు వరకు పెండింగ్ దరఖాస్తులు పూర్తిచేయాలని అన్నారు. ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారి వివరాలు నోటీసు జారీ చేసి అనంతరం తొలగించాలన్నారు. ఇంటింటి సర్వేలో ఆధార్ నంబర్ సేకరణ తప్పనిసరి కాదన్నారు. ఇంటింటి సర్వే సంబంధించి వచ్చిన నూతన ఓటర్ నమోదు దరఖాస్తుల వివరాలు, నూతన ఓటర్ల నమోదు సంబంధించిన అంశాలు రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేయాలన్నారు. నూతన ఓటరు కార్డుల ముద్రణకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీక రణకు చర్యలు తీసుకోవాలని, బూత్‌స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సమర్పించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రం లొకేషన్, ఫొటోలను బీఎల్‌వో యాప్‌లను అప్‌లోడ్ చేయాలన్నారు. బీఎల్‌వో యాప్ వినియోగంపై బూత్‌స్థాయి అధికారులకు అవసరమైన శిక్షణ అందించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ ప్రక్రియ డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురణ అక్టోబరు 29వతేదీకి ముందు పూర్తిచేయాలని సీఈవో అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేష్, రాజేశ్వర్, తహసీల్దార్లు షరీఫ్, మహేష్, ఎన్నికల డీటీ పాషా పాల్గొన్నారు.

ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు చర్యలు

- జడ్పీ సీఈవో ఎస్ వినోద్

చందుర్తి, సెప్టెంబరు 24: గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు చర్యలు తీసుకొంటున్నామని జడ్పి సీఈవో ఎస్ వినోద్ అన్నారు. చందుర్తి మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశమందిరంలో చందుర్తి, రుద్రంగి మండలాల గ్రామ మంచినీటి సహాయకులకు మంగళవారం శిక్షణ తరగతులను ప్రారంభించారు. గ్రామంలో మంచినీటి పైపులైన్ల నిర్వహణ, వాటర్ నీటి నాణ్యత పరీక్షలు, క్లోరినేషన్ ప్రక్రియపై నాలుగు రోజులు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యదర్శితో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో పనులు చేపడతామన్నారు.

మొదటిరోజు ప్లంబింగ్ పైప్ ఫిట్టింగ్స్ ఇచ్చామని తెలిపారు. 26న మోటార్స్ రిపేర్స్, 28న హ్యాండిపంప్ రిపేర్స్, 29న వాటర్ క్వాలిటీ అనాలిసిస్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మొదటిరోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా ప్లంబింగ్ పైప్‌లైన్‌ల శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో నటరాజ్, ఆర్‌డబ్ల్యూ డీఈ సీహెచ్ ప్రేమ్‌కుమార్, ఏఈ రవిశంకర్, మాస్టర్ ట్రైనర్ పి రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో ఎస్ వినోద్

ఇల్లంతకుంట: మంచినీటి సహాయకులు శిక్షణా శిబిరంలో నేర్చుకున్న విషయాలను గ్రామాల్లో అమలు చేయాలని మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ సూచించారు. మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో పనిచేసే వారికి శిక్షణా శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు హైద్రాబాద్‌లో శిక్షణ పొందిన వారి ద్వారా కొత్త చేతిపంపులు ఎలా బిగించాలి, మరమ్మతులు ఎలా చేసుకోవాలో వివరిస్తారని తెలిపారు. శిక్షణ ఇవ్వడం ద్వారా గ్రామపంచాయతీల్లో ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, ఎంపీవో శ్రీనివాస్, మిషన్ భగీరథ ఏఈ రమేష్, ట్రైనర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో నాణ్యమైన ఉపకరణాలు

● టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్

గణేశ్‌నగర్, సెప్టెంబరు 24 : విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ ఉపకరణాలు తక్కువ ధరల్లో అందిస్తున్నామని కరీంనగర్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ వడ్లకొండ గంగాధర్ ఓ ప్రకటనలో తెలిపారు. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్, కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ అనుబంధిత ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) భాగస్వామ్యంతో ఉపకరణాలు అందిస్తున్నామన్నారు. విద్యుత్ ఆదా చేసేందుకు ఎల్‌ఈడీ బల్బులు, ట్యూబ్ లైట్లు, ఇండక్షన్ స్టవ్, ఫైవ్‌స్టార్ బీఎల్‌డీసీ, ఫ్యాన్లు, సూపర్ ఎఫిషియంట్ ఎయిర్ కండిషనర్లు, ఎల్‌ఈడీ, ఇన్వర్టర్ బల్బులు అందుబాటులో ఉంచామన్నారు. వినియోగదారులు ముందుగా www.tgnpdcl.com వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) వారి హోం పేజీలోకి వెళ్లాలన్నారు. అక్కడ అందుబాటులో ఉన్న విద్యుత్ ఉపకరణాలను కొనుగోలు చేయవచ్చని తెలిపారు. వినియోగదారులకు కావాల్సిన విద్యుత్ ఉపకరణాలను సులభతరంగా ఆర్డర్ చేసుకోవచ్చన్నారు. విద్యుత్ వినియోగదారులు కొనుగోలు చేసిన వస్తువులు వారి ఇంటికే డెలివర్ చేస్తామని తెలిపారు. ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) పేజీలో ఉన్న క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేసి ఆర్డర్ చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అస్వస్థతకు గురైన వృద్ధుడిని బస్సులోంచి దింపేసిన కండక్టర్

● దిగిన వెంటనే ఆగిన ఊపిరి ● మృతుడిది కామారెడ్డి జిల్లా

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 24: అస్వస్థతకు గురైన వృద్ధుడిని ఆర్టీసీ బస్సులోంచి కండక్టర్ దింపేశాడు.. కొద్దిసేపటికే ఆ వృద్ధుడు గుండెపోటుతో మృతిచెందిన ఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం రత్నగిరిపల్లి గ్రామానికి చెందిన వృద్ధుడు వట్టిమల్ల ఎల్లయ్య(67) తన భార్య రాజవ్వతో కలిసి కరీంనగర్‌లోని ఆసుపత్రికి వెళ్లేందుకు గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామం స్టేజీ వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కారు. కరీంనగర్ వరకు టిక్కెటు తీసుకున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి వద్దకు బస్సు చేరుకోగానే వృద్ధుడు ఎల్లయ్య అస్వస్థతకు లోనయ్యాడు. కండక్టర్ ఆ దంపతులను ఇక్కడే హాస్పిటల్ ఉంది చూపించుకోమని బస్సు నుంచి కిందకు దింపేశాడు. వెంటనే ఎల్లయ్య కిందపడిపోగా అక్కడ ఉన్న యువకులు 108 వాహనానికి సమాచారం అందించడంతో సిబ్బంది చేరుకుని సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు వృద్ధుడు గుండెపోటుతో చనిపోయాడని నిర్ధారించారు. అస్వస్థతకు గురైన వృద్ధుడిపై మానవత్వం చూపాల్సిన ఆర్టీసీ బస్సు కండక్టర్ వృద్ధ దంపతులను బస్సు నుంచి కిందకు దింపేడయంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎల్లారెడ్డిపేటలో ఆసుపత్రి ఉందని అక్కడి వరకు తీసుకెళ్లాలని ప్రాధేయపడినా కండక్టర్ పట్టించుకోలేదని మృతుడి భార్య రాజవ్వ ఆవేదన వ్యక్తం చేసింది. ఆర్టీసీ కండక్టర్ వ్యవహరించిన తీరుపై అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రాజవ్వతో పాటు స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

గ్రామపంచాయతీ సిబ్బందిని అడ్డుకున్న గ్రామస్థులు



గ్రామ పంచాయతీ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్థులు

తంగళ్లపల్లి, సెప్టెంబరు 24: కేసీఆర్ నగర్‌లో పారిశుధ్య పనులకు వెళ్తున్న గ్రామపంచాయతీ సిబ్బందిని గ్రామస్థులు మంగళవారం అడ్డుకున్నారు. తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామశివారులోని కేసీఆర్ నగర్‌లో గ్రామపంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులకు వెళ్తుండగా గ్రామస్థులు అడ్డుకొని ధర్నాకు దిగారు. కేసీఆర్ నగర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం సిరిసిల్ల పట్టణ వాసులకు కేటాయించి నిర్వహణ మున్సిపల్‌కు ఉండేది. 15 రోజుల క్రితం కేసీఆర్ నగర్ నిర్వహణ చేపట్టలేమని మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదించారు. కేసీఆర్ నగర్‌లో పారిశుధ్య పనులు నిర్వహణ లేక చెత్తాచెదారం పేరుకుపోవడంతో కలెక్టర్ సందర్శించి గ్రామపంచాయతీకి నిర్వహణ అప్పగించారు. గ్రామస్థులు కేసీఆర్ నగర్‌ను మండపల్లి గ్రామ పంచాయతీలో విలీనం చేయవద్దంటూ నిరసిస్తూ ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ క్రమంలో మంగళవారం మండెపల్లి గ్రామపంచాయతీ పారిశుధ్య సిబ్బంది కేసీఆర్ నగర్‌లో విధులు నిర్వహించడానికి వెళ్తుండగా గ్రామస్థులు అక్కడికి చేరుకొని వారిని అడ్డుకున్నారు. గ్రామపంచాయతీ గేటు ఎదుట ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని గ్రామస్థులకు నచ్చ చెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ నగర్‌ను మండేపల్లి గ్రామపంచాయతీలో విలీనం చేస్తే ఒప్పుకునేది లేదని తెలిపారు.

క్రైం కార్నర్

మరో రూ.14లక్షలు దుర్వినియోగం

- అంజన్న ఉద్యోగిపై పోలీస్‌స్టేషన్‌లో మరోసారి ఫిర్యాదు
- గతంలో రూ.38లక్షలు.. కేసు నమోదు

మల్యాల, సెప్టెంబరు 24 : కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ వేలంల ఇన్‌చార్జీగా విధులు నిర్వహించి దేవస్థానం సొమ్ముల దుర్వినియోగానికి పాల్పడిన కె.శ్రీనివాసాచారిపై అధికారులు మంగళవారం మరోసారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూ.14 లక్షలు దేవస్థానం ఖాతాకు జమ చేయకుండా దుర్వినియోగానికి పాల్పడినట్లు పేర్కొంటూ క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొండపైన దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులు విడతల వారిగా తమ సొమ్ములు దేవస్థానానికి చెల్లిస్తుండగా కొన్నాళ్ల క్రితం ఆ బాధ్యతలు నిర్వహించిన శ్రీనివాసాచారి వ్యాపారులు చెల్లించిన 2023-24 సంవత్సర టెండర్లకు సంబంధించిన రూ.37.90 లక్షలు దేవస్థానం ఖాతాలో జమ చేయకుండా దుర్వినియోగానికి పాల్పడినట్లు పేర్కొంటూ గత ఫిబ్రవరిలో సస్పెన్షన్ వేటు వేశారు. సస్పెన్షన్‌తో పాటు అతనిపై మల్యాల పోలీస్‌స్టేషన్‌లో అప్పటి ఈవో వెంకటేష్ ఫిర్యాదు చేయగా కేసు నమో దు చేసిన అధికారులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. తాజాగా 2022-23 సంవత్సర ఖాతాలు పరిశీలించగా మరో రూ.14,49,900లక్షలు టెండర్‌దారుల చెల్లించిన సొమ్ములు దేవస్థానం ఖాతాలో జమ చేయనట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుత ఈవో రామకృష్ణరావు మంగళవారం శ్రీనివాసాచారిపై మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కాగ శ్రీనివాసాచారిపై సస్పెన్షన్ పొడగిస్తూ దేవాదాయ శాఖ అదేశాలు జారీ చేసింది.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న బస్సు

- ఒకరికి తీవ్ర గాయాలు

మల్యాల, సెప్టెంబరు 24 : ద్విచక్రవాహనాన్ని వెనుకాల నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మల్యాల మండల కేంద్రానికి చెందిన పత్తిపాక గంగాధర్ జగిత్యాల నుంచి బైక్ పై నుంచి మల్యాలకు వస్తుండగా నూకపల్లి సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద వెనుకాల నుంచి వచ్చిన బస్సు ఢీకొంది. దీంతో గంగాధర్ తలకు తీవ్ర గాయాలు అవడంతో పలువురు 108కి సమాచారం అందించగా అంబులెన్స్ ఈఎంటీ ఎస్.జ్యోతి, పైలట్ ఆంజనేయులు ప్రథమ చికిత్స అందజేశారు. గాయపడిన వ్యక్తిని జగిత్యాల ఆసుపత్రికి తరలించారు.

21 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

సైదాపూర్, సెప్టెంబరు 24: మండలంలోని జాగీర్‌పల్లిలో అక్రమంగా నిల్వ చేసిన 21క్వింటాళ్ల పీఈడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ తిరుపతి తెలిపారు. జాగీర్‌పల్లి గ్రామంలో మంగళవారం తెల్లవారు జామున సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా, శంకరపట్నం మండలం వంకాయగూడెం గ్రామానికి చెందిన చిన్న బత్తుల రాజయ్య అక్రమంగా ఓ ఇంట్లో 16 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నిల్వ చేశాడని తెలిసి స్వాధీనం చేసుకున్నామన్నారు. బొమ్మల రామారం బోనగిరి గ్రామానికి చెందిన హేరావత్ మోతిలాల్ వద్ద ఐదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నామని చెప్పారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిరుపతి తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

తిమ్మాపూర్, సెప్టెంబరు 24 : మండలంలోని మహాత్మానగర్ రాజీవ్ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎల్ఎండి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నుస్తులాపూర్ గ్రామానికి చెందిన మాడిశెట్టి నర్సయ్య (55) సోమవారం రాత్రి అలుగునూర్ నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో నరసయ్య తన ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో నరసయ్య తీవ్రంగా గాయ పడ్డాడు. ఆయనను కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మంగళవారం తెల్లవారు జామున నరసయ్య మృతి చెందాడు. అతడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎల్ఎండీ ఎస్సై వివేక్ తెలిపారు.

నర్సయ్య కళ్లు సజీవం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మాడిశెట్టి నర్సయ్య నేత్రాలను ఆయన కుమారుడు మాడిశెట్టి రాజేష్ దానం చేసినట్లు శాతవాహన లయన్స్ క్లబ్, కాళేశ్వరి లయన్స్ బాధ్యులు కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి, కంది జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. నరసయ్య పార్థివ దేహం నుంచి జత నేత్రాలను సేకరించి హైదారాబాద్‌లోని ఎల్ వీ ప్రసాద్ అసుపత్రికి పంపించామన్నారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

రామడుగు, సెప్టెంబరు 24: మండలంలోని వెదిర పరిధిలోని వెంకట గిరికి చెందిన విజ్జగిరి శంకరయ్య (65) అనే వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలి పారు. శంకరయ్య మద్యానికి బానిస కావడం మూలంగా పక్షపాతానికి గురయ్యాడు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఈ నెల 19న గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళ వారం మృతి చెందాడు. మృతుడికి కుమారుడు విజ్జగిరి గంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో ఎల్లయ్య తెలిపారు.

వరట్నం వేధింపులతో వివాహిత ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 24: వివాహం జరిగిన ఏడు నెలలకే అదనపు వరకట్నం వేధింపులతో కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌కు చెందిన దొంత శ్రావణి(22) మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు కట్టరాంపూర్‌లోని ఇంటిలో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. సిద్దిపేట మండలం ఎల్లంపల్లి గ్రామానికి చెందిన శ్రావణికి ఫిబ్రవరి 25న కట్టరాంపూర్‌కు చెందిన అజయ్‌కుమార్‌తో వివాహం జరిగింది. వివాహ సమ యంలో ఒప్పుకున్న వరకట్నం డబ్బులు, ఇతర లాంఛనాలు ముట్టజెప్పారు. అయినప్పటికీ అదనపు వరకట్నం తేవాలంటూ కొద్ది రోజుల నుంచి శ్రావణిని ఆమె భర్త అజయ్‌కుమార్, అత్త ఉపేంద్ర, మామ అంజనేయులు వేధింపులకు గురి చేస్తుండటంతో జీవితంపై విరక్తి చెందిన తన కూతురు ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తండ్రి సంగెం కొంరయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు ముగ్గురిపై వరకట్నం వేధిం పుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు.

కాళేశ్వరం-మంథని-రామగిరి
సర్క్యూట్ అభివృద్ధికి చర్యలు

- దేవాలయాల అభివృద్ధికి పక్కా ప్రణాళికలు సిద్ధం చేయాలి
- 2027లో జరిగే గోదావరినది పుష్కరాల నిర్వాహణకు చర్యలు
- దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్


వేద పండితులతో మాట్లాడుతున్న శైలజా రామయ్యర్

మంథని, సెప్టెంబర్ 24: కాళేశ్వరం-మంథని-రామగిరి సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యర్ వెల్లడించారు. మంగళవారం మంథనిలోని శ్రీమహాలక్ష్మి దేవాలయంలో దేవాదాయ, సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోదావరి తీరంలోని శ్రీగౌతమేశ్వర దేవాలయాన్ని పురావస్తుశాఖ అధికారులతో కలిసి సందర్శించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో దేవాలయాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధిపై సంబంధిత అధికారులతో ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్ సమీక్షా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాళేశ్వరం, మంథని పరిసర ప్రాంతాల్లో ఉన్న ఆలయాలను సందర్శించామన్నారు. కాళేశ్వరం దేవాలయం లోపల, పరిసరాల్లో అభివృద్ధి పనులు చేపట్టే భక్తులకు అవసరమైన వసతులు ఏరకంగా కల్పించాలనే అంశంపై కాళేశ్వరంలో చర్చించామన్నారు. గోదావరినదిని ఏరకంగా శుభ్రం చేయాలి, పుణ్యస్నానాలు చేసేందుకు, షవర్స్ మహిళలకు స్నానాల గదుల ఏర్పాటు విషయాలను చర్చించామన్నారు. మంథనిలో ఆలయాలను సంపూర్ణంగా అభివృద్ధి చేసేందుకు, వచ్చే భక్తులకు కావాల్సిన సదుపాయాల కల్పన కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. దేవాలయాల అభివృద్ధికి రూపొందించే ప్రణాళికల్లో స్వల్ప, దీర్ఘకాలికంగా వేర్వేరుగా ఉండాలన్నారు. 2027 సంవత్సరంలో గోదావరినది పుష్కరాలు వస్తున్నాయని, వీటికి సంబంధించి ఘాట్ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలన్నారు. గోదావరినది తీరంలోని శ్రీగౌతమేశ్వర ఆలయం వద్ద పుష్కరాల సందర్భంగా పార్కింగ్ స్థలం గుర్తించాలన్నారు. మంథనిలో ఆలయాలకు ఒక గుడి నుంచి మరో గుడికి హెరిటేజ్ వాకింగ్ చేసే విధంగా ప్రణాళిక చర్యలు తీసుకోవాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వాహణ కోసం కళాభారతి లాంటి భవనం నిర్మాణానికి అనువైన స్థలం ఎంపిక చేయాలన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ.. మంథని పట్టణంలో ఆరు దేవాలయాలు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయన్నారు. శ్రీసిలేశ్వర-సిద్దేశ్వరాలయం పురావస్తుశాఖ పరిధిలో ఉంటుందన్నారు. శ్రీగౌతమేశ్వరాలయం వద్ద స్నానాల ఘాట్, షవర్లు, స్నాన గదుల ఏర్పాటు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. స్కంధ పురాణం ద్వారా శ్రీగౌతమేశ్వర ఆలయ పురాణం తెలుసుకొని, దీనికి సంబంధించి లైట్‌షో, వాటర్‌షో ఏర్పాటు అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. శ్రీమహాలక్ష్మి ఆలయం సమీపంలోని చెరువులో అక్రమణలు తొలగించి పునరుద్ధరిస్తామని, చెరువులో డ్రైనేజీ నీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రామగిరి ఖిల్లాను పర్యాటకశాఖ పరిధిలో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీవో హనుమానాయక్, తహసీల్దార్ రాజయ్య, పురావస్తు, దేవాదాయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి యువకుడి ఆత్మహత్య

- మృతికి తల్లే కారణమంటూ కులస్థులు దాడి
- ఆస్తి తండ్రి పేరు మీదకు మార్చాలని అంత్యక్రియలు నిలిపివేత

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు, 24 : మండలంలోని జగ్గాసాగర్ గ్రామానికి చెందిన ఏనుగు ప్రభాస్(19) అను యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన ఏనుగు ప్రతాప్, అనంత దంపతులకు కుమారుడు ఏనుగు ప్రభాస్ ఉన్నాడు. ప్రతాప్ జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు. గ్రామంలో ప్రభాస్ తన తల్లితో కలిసి ఉంటున్నాడు. ప్రభాస్ ఇంటర్ పూర్తి చేసి హోటల్ మేనేజ్మెంట్ చేద్దామని తల్లిదండ్రులకు తెలిపాడు. వారు ఏదైనా జాబ్ చేయమని మందలించడంతో మనస్థాపానికి గురై ఈనెల 8న రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించి తల్లి చికిత్స కోసం మెట్‌పల్లికి తరలించగా వైద్యులు పరిశీలించి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న ప్రభాస్ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఈనెల 22న నిజామాబాద్‌లో చికిత్స పొందుతున్న ప్రభాస్ వాంగ్మూలాన్ని మెజిస్ట్రేట్ రికార్డు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆస్తి మార్పిడి కోసం ఆగిన అంత్యక్రియలు

మృతికి తల్లి కారణమంటూ కులస్థులు దాడి..

చికిత్స పొందుతూ మృతి చెందిన ప్రభాస్ అంత్యక్రియలు ఆస్తి మార్పిడి కోసం ఆగిపోవాల్సి వచ్చింది. ఇల్లరికం వచ్చిన ఏనుగు ప్రతాప్ 17 ఏళ్ల నుంచి గల్ఫ్ వెళ్లి సంపాదించిన ఆస్తి మొత్తం తన భార్య అనంత పేరు మీద ఉందని గ్రామస్థులు ఆరోపించారు. ఆ ఆస్తి మొత్తం ప్రతాప్ పేరున రిజిస్టర్ చేస్తేనే అంత్యక్రియలు చేయాలని అంత వరకు నిలపాలని బంధువులు మృతదేహాన్ని ఇంటి వద్దనే ఉంచారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని ఒప్పించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది. మరోవైపు ప్రభాస్ మృతికి తల్లి అనంత కారణమని గ్రామంలోని కులస్థులు ఆరోపిస్తున్నారు. మంగళవారం ప్రభాస్ మృతదేహంతో ఇంటికి వచ్చిన తల్లిపై గ్రామంలోని కులస్థులు దాడి చేశారు. గమనించి ఎస్సై చిరంజీవి ప్రభాస్ తల్లిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. పెద్ద ఎత్తున గ్రామస్థులు చేరుకోవడంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వెంటనే డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి అక్కడి చేరుకుని వారిని శాంతింపజేశారు.

జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీలకు బడితండా యువకుడు

రుద్రంగి, సెప్టెంబర్ 24 రుద్రంగి మండలం బడితండా గ్రామానికి చెందిన మాలోత్ అనిల్ జాతీయస్థాయి ట్రెక్కింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. అనిల్ కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో బీకాం రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల జరిగిన శాతవాహన యూనివర్సిటీలో ట్రెక్కింగ్ పోటీల్లో పాల్గొన్నాడు. ఉత్తమ ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. అక్టోబరు 22న హిమచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీల్లో పాల్గొననున్నాడు. యువకుడు జాతీయ స్థాయికి ఎంపిక కావడంతో బడితండా గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగిత్యాలలో ఆన్‌లైన్ మోసం

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 24 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ మహిళ ఆన్‌లైన్ మోసానికి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పట్టణంలోని పోచమ్మవాడ ప్రాంతానికి చెందిన ఓ మహిళ ఆన్‌లైన్ యాప్ వలలో చిక్కుకుని అధిక డబ్బులు వస్తాయనే ఆశతో రూ. 1.78 లక్షల పెట్టుబడి పెట్టింది. పెట్టుబడి పెట్టిన మరుసటి రోజే యాప్ కనబడకపోవడంతో మోసాపోయానని గ్రహించిన మహిళ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

'నవోదయ' దరఖాస్తుల గడువు పొడిగింపు

చొప్పదండి, సెప్టెంబరు 24: పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశపరీక్ష దరఖాస్తు గడువును అక్టోబరు 7వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 8, 9 తేదీల్లో దరఖాస్తులను ఎడిట్ చేసుకునేందుకు అవకాశం కల్పించామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

పీజీ 2,4 సెమిస్టర్ల పరీక్షల ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, సెప్టెంబరు 24 : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జూలై, ఆగస్టు 2024లో నిర్వహించిన పీజీ, రెండవ, నాలుగవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగప్రసాద్ మంగళవారం విడుదల చేశారు. ఎంఏ (ఇంగ్లీష్, ఉర్దూ, తెలుగు, ఎకనామిక్స్, సోషియాలజీ, ఎమ్మెస్‌డబ్ల్యూ) ఎమ్ఎస్‌ఈ(వృక్షశాస్త్రం, జువాలజీ, స్టాటిస్టిక్స్, న్యూట్రిషన్ డైటెటిక్స్) ఎంసీఏ పరీక్షల ఫలితాలు శాతవాహన విశ్వవిద్యాలయం వెబ్సైట్ www. satavahana.ac.inలో అందుబాటులో ఉన్నాయన్నారు.

28న యోగా ఇన్స్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ

సుభాష్‌నగర్, సెప్టెంబరు 24 : ప్రభుత్వ ఆసుపత్రుల్లో యోగా ఇన్స్‌స్ట్రక్టర్ పోస్టులకు ఈ నెల 28 ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కరీంనగర్ ఆయుష్‌శాఖ జిల్లా ఇంచార్జీ డాక్టర్ యస్రబ్‌సుల్తానా, డీపీఎం ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఖాళీగా ఉన్న 90 పోస్టులను భర్తీ చేయనున్నట్లు కరీంనగర్‌లో 15మంది పురుషులు, 15 మంది స్త్రీలు, పెద్దపల్లి 10 మంది పురుషులు, 10 మంది స్త్రీలు, రాజన్నసిరిసిల్ల 8 మంది పురుషులు, 8 స్త్రీలు, జగిత్యాల 12 మంది పురుషులు, 12 మంది స్త్రీలు పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. పురుషులు కనీసం 32 యోగా తరగతులు, స్త్రీలు 20 యోగా తరగతులకు హాజరుకావాలని సూచించారు. పురుష శిక్షకులకు ఒక తరగతికి రూ. 250 చొప్పున రూ. 8వేలు, స్త్రీలకు రూ. 5వేలు పారితోషికం ఇస్తారని తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్హతతోపాటు కనీసం 6నెలల యోగా సర్టిఫికెట్ ఉండాలని, 45 సంవత్స రాలలోపు వయస్సు కలిగిన ఉండాలని, యోగా నైపుణ్యత ఉండాలని సూచించారు. ఈ పోస్టులు పార్ట్‌టైం పద్ధతిలో భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు కరీంనగర్‌లోని రాంనగర్‌లో గల ఆయుష్, ఆయుర్వేద ఆసుపత్రిలో ఈ నెల 28న ఉదయం 10 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

మళ్లీ తెరుచుకున్న శ్రీరాంసాగర్ గేట్లు

- 7 గేట్ల ద్వారా 21,868 క్యూసెక్కుల నీరు దిగువకు

జగిత్యాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు చెందిన గేట్లు మంగళవారం ప్రస్తుత సీజన్‌లో మరోమారు తెరుచుకున్నాయి. ప్రాజెక్టుకు చెందిన 7వరద గేట్లను తెరిచి 21,868 క్యూసెక్కుల నీరును దిగువకు వదులుతున్నారు. ఎస్సారెస్పీలోకి 45,858 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగునీటి కాలువలు, ఇతర అవసరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 45,858 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నుంచి స్పిల్‌వే ఆర్‌సీగేట్ల ద్వారా నీరు విడుదల చేస్తున్నందున గోదావరినదిలో చేపలు పట్టేందుకు వెళ్లరాదని, వలలు కొట్టుకుపోయే అవకాశం ఉన్నందున బయటకు తీసుకోవాలని, పశువుల కాపర్లు, సామన్య ప్రజలు ఎవరూ నదిలోకి దిగొద్దని, ప్రమాదానికి గురి కావద్దని అధికారులు కోరుతున్నారు.

కూతురికి అత్తింటి వేధింపులు..

- బావిలో దూకి తండ్రి బలవన్మరణం
- 9 గంటల పాటు కొనసాగిన గాలింపు చర్యలు
- లభ్యమైన మృతదేహం
- రాచర్లబొప్పాపూర్‌లో విషాదం


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 24 : కుమార్తెకు న్యాయం జరగడం లేదని సోమవారం రాత్రి పాడు పడిన బావిలో దూకిన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌కు చెందిన అగుళ్ల శ్రీనివాస్ (48) మృతదేహం మంగళవారం తెల్లవారుజామున లభ్యమైంది. కుటుంబసభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని అగుళ్ల స్వరూప-శ్రీనివాస్ దంపతులకు కూతురు రమ్య, కొడుకు రాజేశ్ ఉన్నారు. రమ్యను సిరిసిల్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన మిట్టపల్లి ప్రశాంత్‌కు ఇచ్చి 10 ఏళ్ల కిందట పెళ్లి జరిపించారు. వారికి పదేళ్ల వయసు లోపు ఉన్న ఇద్దరు పిల్లలు రిషివర్ధన్, కీర్తన ఉన్నారు. కొంత కాలంగా భార్యాభర్తల నడుమ కలహాలు చోటు చేసుకుంటున్నాయి. భర్తతో పాటు అత్తింటి వారు రమ్యను వేధింపులకు గురి చేస్తున్నారు. ఈ క్రమంలో పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు జరిగాయి. మంచిగా చూసుకోవాలని మందలించినా మార్పు రాలేదు. దాంతో ఆరు రోజుల కిందట రమ్య అత్తింటిలో ఆత్మహత్యాప్రయత్నం చేసింది. విషయం తెలియడంతో తండ్రి శ్రీనివాస్ చేరుకుని చికిత్స చేయించి స్వగ్రామానికి తీసుకు వచ్చాడు. తన కూతురును అత్తింటి వారు వేదిస్తున్నారని పేర్కొంటూ ఈ నెల 21న స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. న్యాయం జరగడం లేదని భావించిన శ్రీనివాస్ సోమవారం రాత్రి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని వారి సంఘానికి సంబంధించిన వాట్సాప్ గ్రూప్‌లో సందేశం పంపి ఇంటి సమీపంలోని పాడుబడిన వ్యవసాయ బావిలో దూకాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రమాకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. బావి చుట్టూ చెట్లు ఏపుగా ఉండడంతో గాలింపు కష్టతరంగా మారింది. బావిలో నీళ్లు అధికంగా ఉండడం వల్ల మోటార్‌ను తెప్పించి నీటిని తోడేసేలా చర్యలు తీసుకున్నారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వేకువజాము వరకు తొమ్మిది గంటలపాటు గాలింపు కొనసాగింది. చివరకు శ్రీనివాస్ మృతదేహం లభ్యమవడంతో బయటకు వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

ఆత్మహత్యకు కారణమైన ఆరుగురిపై కేసు

అగుళ్ల శ్రీనివాస్ ఆత్మహత్యకు కారణమైన సంఘటనలో సిరిసిల్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన మృతుడి అల్లుడు మిట్టపల్లి శ్రీకాంత్‌తో పాటు ఆయన తల్లిదండ్రులు లక్ష్మీ, వీరస్వామి, సోదరుడు ప్రశాంత్, బంధువులు పద్మ, సతీష్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ పేర్కొన్నారు.


బావి వద్ద ఎక్స్‌కవేటర్‌తో చెట్ల తొలగింపు

శ్రీనివాస్ కూతురు రమ్యను సిరిసిల్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన మిట్టపల్లి శ్రీకాంత్‌తో 10 ఏళ్ల కిందట పెళ్లి చేశారని పేర్కొన్నారు. కాలంగా భార్యాభర్తల నడుమ కలహాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ క్రమంలో ఈ నెల 20న రమ్యను పుట్టింటి నుంచి అదనంగా ఐదు లక్షల రూపాయల కట్నం తీసుకురావాలని భర్తతో పాటు అత్తమామలు, మరిది, బంధువులు వేధింపులకు దిగడంతో ఆమె ఆత్మహత్యకు యత్నించిందని పేర్కొన్నారు. విషయం తెలిసిన తండ్రి శ్రీనివాస్ చేరుకుని ఆమెకు చికిత్స అందించి రాచర్లబొప్పాపూర్ గ్రామానికి తీసుకువచ్చాడని తెలిపారు. మృతుడు శ్రీనివాస్ కొడుకు రాజేశ్ ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

పిటీషన్ మేనేజ్‌మెంట్‌లో
గోదావరిఖని వన్‌టౌన్‌కు 4వ స్థానం

- రిసెప్షన్ ఆఫీసర్ వెంకట లక్ష్మీ సేవలకు గుర్తింపు..
- సత్వర సేవల్లో బెల్లంపల్లి వన్‌టౌన్, ధర్మారం ఠాణాల ఎంపిక


ధర్మారం ఎస్‌ఐ లక్ష్మణ్


. కానిస్టేబుల్ వెంకటలక్ష్మి

కోల్‌సిటీ, సెప్టెంబరు 24 : పిటీషన్ మేనేజ్‌మెంట్ సిస్టంలో రాష్ట్ర వ్యాప్తంగా ఐదు పోలీస్ స్టేషన్లను ఎంపిక చేయగా, గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు 4వ స్థానం లభించింది. పోలీస్ స్టేషన్‌లో రిసెప్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్న కానిస్టేబుల్ వెంకటలక్ష్మి స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యదగా ప్రవర్తించి వారి సమస్యలను తెలుసుకుని అధికారుల వద్దకు తీసుకువెళ్లేవారు. వారి దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి రశీదు కూడా అప్పగిస్తున్నారు. ఉత్తమ సేవలు అందించినందుకు ఆమెకు గుర్తింపు లభించింది. ఠాణా కూడా ఎంపికైంది. అలాగే సత్వర సేవల విభాగంలో బెల్లంపల్లి వన్‌టౌన్‌కు 3వ స్థానం, ధర్మారం పోలీస్ స్టేషన్‌కు 5వ స్థానం లభించాయి. బెల్లంపల్లి వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ దేవయ్య, ధర్మారం ఎస్‌ఐ లక్ష్మణ్‌లు ఠాణాలకు వచ్చే బాధితులతో మర్యదగా ప్రవర్తించి వారి సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించడం, వారికి పోలీసులపై నమ్మకం కలిగించారని సీపీ శ్రీనివాస్ తెలిపారు. ప్రజలు ఆన్‌లైన్ ఫీడ్ బ్యాక్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు సత్వర సేవలందిస్తున్న విభాగాల్లో పది ఠాణాలను ఎంపిక చేయగా బెల్లంపల్లి ధర్మారం, ఠాణాలకు స్థానం దక్కింది.

అడవి పందుల దాడిలో వరి పంట ధ్వంసం


ధర్మారంలో అడవి పందుల దాడిలో ధ్వంసమైన వరి పంటను చూపిస్తున్న రైతు

కోనరావుపేట, సెప్టెంబరు 24: కోనరావుపేట మండలం ధర్మారం గ్రామశివారులో అడవి పందుల దాడిలో వరి పంట మంగళవారం ధ్వంసం అయింది. గ్రామానికి చెందిన బొడ్డు శంకర్, బొడ్డు ప్రవీణ్, మల్లవేని తిరుపతి అనే రైతులకు చెందిన వరి పొలంను అడవి పందులు ధ్వంసం చేశాయి. కోతకు వచ్చే సమయంలో వరి పంటను ధ్వంసం చేశాయని బాధిత రైతులు తెలిపారు. అటవీశాఖ అధికారులు స్పందించి నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

రుణమాఫీ చేయాలంటూ రైతువేదికకు తాళం

ఇబ్రహీంపట్నంలో నిరసన తెలిపిన రైతులు


రైతువేదికకు తాళం వేసి నిరసన తెలుపుతున్న రైతులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 24 : రెండు లక్షల రుణమాఫీ వెంటనే చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇబ్రహీంపట్నం రైతులు ఇబ్రహీంపట్నం రైతువేదిక కార్యాలయానికి తాళంవేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రుణమాఫీ, రైతుబంధు నిదులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 15 రోజున 2లక్షల రుణమాఫీ చేస్తా అని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు చేయలేదన్నారు. వానాకాలం సీజన్ ముగిసిన ఇప్పటి వరకు రైతుబంధు రాలేదని ఇప్పటికైన ప్రభు త్వం కళ్లు తెరిచి రుణమాఫీ, రైతు బంధు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు ఏలేటి చిన్నారెడ్డి, నాంపల్లి రమేష్, కల్లెం చిన్న సాయన్న, బాస జలంధర్, తీగల రవీందర్‌రెడ్డి, బద్దం సత్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 24: కేసుల పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్ సూచించారు. సిరిసిల్ల బార్ అసోసియేషన్ హాలులో ఈనెల 28న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత ఆదేశాల మేరకు న్యాయవాదులతో మంగళవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించేలా కృషిచేయాలన్నారు. ఇందుకు న్యాయవాదులు కక్షిదారులకు చైతన్యం కల్పించాలన్నారు. న్యాయసేవాధికార సంస్థ సేవలను అందరికి అందేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డేర్నాల సంజీవరెడ్డి, కార్యదర్శి తంగళ్లపల్లి వెంకటి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కేటీఆర్ కనిపించడం లేదని ఫిర్యాదు

గంభీరావుపేట, సెప్టెంబరు 24: సిరిసిల్ల నియోజకవర్గ ఎమ్మెల్యే కేటీఆర్ కనిపించడంలేదని బీజేపీ కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు కోడె రమేష్ గంభీరావుపోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. కొన్ని నెలలుగా కేటీఆర్ తన నియోజకవర్గానికి రావడంలేదని అభివృద్ధి గురించి పట్టించుకోవడంలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో లింగన్నపేట వాగు హైలెవల్ బ్రిడ్జి మంజూరు చేసి ఇప్పటికీ పనులు మొదలుకాకపోవడంతో అంతర్యం ఏమిటని కాంట్రాక్టర్‌తో గత పాలకులు కుమ్మక్కవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని కోడె రమేష్ ఆరోపించారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అందుబాటులో ఉండే విధంగా చూడాలని ఫిర్యాదులో కోరారు.

30న దివ్యాంగులకు బస్ పాస్‌ల జారీ మేళా

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 24: టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో ఈ నెల 30న దివ్యాంగులకు బస్ పాస్‌ల జారీ మేళాను నిర్వహిస్తామని సిరిసిల్ల డిపో మేనేజర్ ప్రకాష్‌రావు మంగళవారం తెలిపారు. సిరిసిల్ల కొత్త బస్టాండ్‌లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటలకు వరకు బస్ పాస్‌ల మేళా ఉంటుందని పేర్కొన్నారు. దివ్యాంగులు సదరన్ సర్టిఫికెట్‌లో లోకో మోటర్/ఆర్థో 40 శాతం, మెంట్ రిటార్డేషన్ ఉన్న వారు ఐక్యూ 69 శాతం కంటే తక్కువ ఉన్న దివ్యాంగులే బస్ పాస్‌లకు అర్హులని సూచించారు. అర్హులైన దివ్యాంగులు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్, ఐడీ కార్డుతో పాటు సర్వీస్ చార్జీ 50 రూపాయాలతో మేళాలో పాల్గొని పీహెచ్‌సీ బస్‌పాస్‌లను తీసుకోవాలని పేర్కొన్నారు.

పార్టీ అధిష్ఠానం చర్యలు తీసుకోవాలి

గంభీరావుపేట, సెప్టెంబరు 24: సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిపై విమర్శలు చేసిన వారిపై పార్టీ అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని గంభీరావుపేట కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు పాపగారి రాజుగౌడ్ డిమాండ్ చేశారు. గంభీరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు విలేకరులతో మాట్లాడారు. పట్టణ శాఖ అధ్యక్షుడు పాపగారి రాజుగౌడ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పంతం సురేష్ మాట్లాడుతూ సిరిసిల్లలో కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేని నాయకులు సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డిపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గడిచిన 10 సంవత్సరాల నుంచి సిరిసిల్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న కేకే మహేందర్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. విమర్శలు చేసిన నాయకులను పార్టీ నుంచి శాశ్వతంగా బహిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు బీసీ సెల్ మండల అధ్యక్షుడు గుర్రం రాజుగౌడ్, ఎలుక రాజుమహ్మద్, ఆజాం, జంగం రాజు, ఏడబోయిన ప్రభాకర్, రాజనర్సు విఠల్ నాయక్, బలరాం రెడ్డి, సంతోష్ గౌడ్, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

మల్లయ్యకుంటను పరిశీలించిన అధికారులు



మల్లయ్యకుంట వద్ద అధికారులు

వేములవాడ రూరల్, సెప్టెంబరు 24: మండలంలోని మర్రిపల్లి గ్రామంలోని 750 సర్వేనంబర్‌లో మల్లయ్యకుంట ఆక్రమణకు గురైందని గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా అధికారులు స్పందించారు. మంగళవారం పలు శాఖల అధికారులు గ్రామంలోని మల్లయ్యకుంటను పరిశీలించారు. సర్వేనంబర్‌లో 18.1800ఎకరాల భూమిలో మల్లయ్యకుంట ఉండేదని కొందరు కుంటను ఆక్రమించి రైస్ మిల్లులు నిర్మించారని రెవెన్యూ నక్షలో సైతం మల్లయ్యకుంట ఉన్నట్లు గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రైస్‌మిల్లుల ద్వారా వాతావరణం కాలుష్యం అవుతోందని పంట పొలాలకు నష్టం వాటిల్లుతోందని, సమీపంలో ఉన్న కస్తూర్బా పాఠశాలల విద్యార్థినులకు ఇబ్బందవుతోందని గ్రామస్థులు తెలిపారు. రైసుమిల్లుల పరిసరాలను, కుంటను పరిశీలించిన అధికారులు త్వరలో నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అధికారి భారతి, ఈడీఎస్‌సీ కార్పొరేషన్ అధికారి స్వప్న, పొల్యూషన్ కంట్రోల్ అధికారి జ్యోతి, రూరల్ తహసీల్దార్ సుజాత, వేములవాడ టౌన్ ప్లానింగ్ అధికారి అన్సారి, సర్వేయర్ సంపత్ తదితరులు ఉన్నారు.

టీబీ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం

రుద్రంగి, సెప్టెంబరు 24: రాజన్నసిరిసిల్లను టీబీ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యమని టీబీ అలర్ట్ ఇండియా ఆర్గనైజేషన్ జిల్లా అధికారి దండుబోయిన శ్రీనివాస్ అన్నారు. రుద్రంగి మండలంలోని అన్ని హెల్త్ సెంటర్‌ల్లో టీబీ నివారణపై ఆరోగ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీని ప్రజల నుంచి దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఐదు జిల్లాలను ఎంపిక చేసిందని అందులో సిరిసిల్ల జిల్లాను ఎంపిక జేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎమ్‌ఎల్‌హెచ్‌పీ లక్ష్మీప్రసన్న, శైలజ, ఏఎన్ఎంలు విజయ, రాజేశ్వరి, రజిత, కవిత, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

- రూ. ఒక కోటి 44 లక్షల నగదు ఆదాయం

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 24: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌లో ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో అత్యంత భద్రత మధ్య హుండీలను విప్పి లెక్కించారు. రాజన్న ఆలయ 12 రోజుల హుండీ ఆదాయం లెక్కించగా రూ. ఒక కోటి 44 లక్షల 6 వేల 154 నగదు సమకూరగా 710 గ్రాముల బంగారం, 14 కిలోల వెండి రాజన్న ఆలయ ఖజానకు సమకూరినట్లు తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఏసీ కార్యలయ పరిశీలకులు సత్యనారాయణ, ఏఈవోలు, సూపరింటెంట్‌లు ఆలయ సిబ్బంది పాల్గొనగా ఎస్పీఎఫ్ సిబ్బంది భద్రతా ఏర్పాట్లు చేశారు.



హుండీ లెక్కింపులో పాల్గొన్న రాజన్న ఆలయ ఉద్యోగులు

దేశాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలి





వేములవాడలో పాల్గొన్న విద్యార్థులు, సిరిసిల్ల ఎన్ఎస్ఎస్ అధికారిని సన్మానిస్తున్న అధ్యాపకులు

వేములవాడ, సెప్టెంబరు 24: దేశాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ శరత్ కుమార్ అన్నారు. ఎన్ఎస్ఎస్ జాతీయ దినోత్సవాన్ని వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి అంజయ్య నేతృత్వంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, రంగోలి, ర్యాలీ, పెయింటింగ్, ఉపన్యాస పోటీలను నిర్వ హించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులు జె రేణుశ్రీ, బి భార్గవి, కే శృతి, టి వాణి, డి శరణ్య తదితరులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజ, జాతీయ అభివృద్ధిలో పాలుపంచుకునే విధంగా కృషి చేయడం లక్ష్యంగా ఎన్ఎస్ఎస్ పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శేఖర్, మహేందర్, అశోక్, రవీందర్ మహేందర్‌రెడ్డి, సంతోష్, దేవయ్య, మంగమ్మ, లత, అరుణ, జ్యోతి, దీపిక పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: విద్యార్థులు చదువుతోపాటు సమాజ సేవలో పాల్గొనాలని సెస్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వనజ కుమారి కోరారు. సిరిసిల్ల పట్టణంలోని సెస్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం అవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ అధికారి మడుపు నవీన్‌రెడ్డిని సన్మానించారు. అనంతరం కళాశాల అవర ణలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు పరిసరాలను శుభ్రం చేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సమాజ సేవలో తమ వంతు సహాయసహకారాలు అందించాలని సూచించారు. అపదలో ఉన్న వారికి చేతనైన సహాయం అందించాలన్నారు. సమాజంలో మూఢ నమ్మకాలపై ప్రజలకు అవగహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక వేడుకలు జరిగాయి. కళాశాల ప్రాంగణంలో మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కాస దేవరాజం మాట్లాడుతూ విద్యార్థుల్లో సామాజిక స్పృహ కల్పించడంలో ఎన్ఎస్ఎస్ క్రియాశీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రతీ సంవత్సరం ఏర్పాటు చేస్తున్న శిబిరాలతో విద్యార్థులకు గ్రామాల్లోని సమస్యలపై అవగాహన పెరుగుతుందని, దీని ద్వారా భవిష్యత్తును నిర్మించుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. ప్రోగ్రాం అధికారి కుమారస్వామితో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆవిర్భావ వేడుకలను కళాశాల ప్రిన్సిపాల్ వి విజయలక్ష్మి ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. రక్తదాన మహాదానం, సమాజ సేవే ఎన్ఎస్ఎస్ లక్ష్యం, మూఢనమ్మకాలు నిర్మూలిద్దాం, పచ్చదనం పరిశుభ్రత, వంటి నినాదాలతో ప్లకార్డులను ప్రదర్శించి ఉత్సాహంగా ర్యాలీని నిర్వహించారు. గంభీరావుపేట మండల కేంద్రంలో ఉన్న అనాథాశ్రమంలోకి వెళ్లి అక్కడ ఉన్న వారిని పరామర్శించి, వారి బాగోగులను తెలుసుకున్నారు. అనంతరం వారికి పళ్లు, ఫలాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ప్రభాకర్, వి. వాణి, డాక్టర్ వై అంజనేయులు, డాక్టర్ కే శ్రావణ్, డాక్టర్ ఆది విష్ణు, సుచరణ్, కృష్ణప్రసాద్, మహేష్, శైలజ, భార్గవి, దీపిక పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు విద్యార్థి ఎంపిక

కోనరావుపేట, సెప్టెంబరు 24 : కోనరావుపేట మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో చదువుతున్న వంగపల్లి ప్రవీణ్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వనపర్తి మల్లేశం మంగళవారం తెలిపారు. హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ క్రీడలకు ఎంపిక కాగా విద్యార్థినిని ఉపాధ్యాయ బృందం అభినందించారు.

శ్రీవారి ప్రసాదం కల్తీని నిరసిస్తూ పాదయాత్ర

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 24: తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడకాన్ని నిరసిస్తూ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో హిందూ ధర్మ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో భక్తులు మంగళవారం పాదయాత్రను చేపట్టారు.

స్థానిక మార్కండేయ ఆలయం నుంచి ప్రధాన వీధుల గుండా నగర సంకీర్తన చేస్తూ ముందుకు సాగారు. సాయిబాబా ఆలయం వరకు యాత్ర కొనసాగింది. ప్రసాదం కల్తీ చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. భక్తుల మనోభావాలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఈశ్వర్, జితేందర్, ప్రభాకర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, కిషన్, రాంరెడ్డి, పద్మారెడ్డి, వెంకటేశ్, శ్రీనివాస్, నర్సయ్య, కిరణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంటలో భారీవర్షం

ఇల్లంతకుంట, సెప్టెంబరు 24: మండలంలో భారీవర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం ప్రారంభం అయిన వర్షం గంటపాటు పడటంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మండల కేంద్రంలోని బస్టాండు ప్రాంతంలో నీరు నిలువడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

మంత్రి పొన్నంను కలిసిన ఏఎంసీ పాలకవర్గ సభ్యులు



మంత్రితో ఏఎంసీ పాలకవర్గ సభ్యులు

ముస్తాబాద్, సెప్టెంబరు 24: మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను ముస్తాబాద్ మండల మార్కెట్ కమిటీ పాలక వర్గ సభ్యులు మంగళవారం కలిశారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన తలారి రాణినర్సింలు, వైస్ చైర్మన్‌గా నియమించబడ్డ వెల్ముల రాంరెడ్డి, డైరెక్టర్లు కొమురవెల్లి, గుండెల్లి శ్రీనివాస్, గాంత రాజు, కొండం రాజిరెడ్డి పొన్నం ప్రభాకర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

'నాయీబ్రాహ్మణుల పొట్ట కొట్టేందుకు కుట్రలు'



ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయీబ్రాహ్మణులు

వేములవాడ, సెప్టెంబరు 24: నాయీబ్రాహ్మణ కులవృత్తితో సంబంధం లేని వ్యక్తి సెలూన్ ఏర్పాటు కోసం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని వేములవాడ పట్టణానికి చెందిన నాయీబ్రాహ్మణులు స్థానిక శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు మొరపెట్టుకున్నారు. వేములవాడ పట్టణానికి చెందిన నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు, సభ్యులు ఆది శ్రీనివాస్‌ను మంగళవారం కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. వేములవాడలో తరతరాలుగా నాయీ బ్రాహ్మణులు మాత్రమే సెలూన్లు నిర్వహిస్తున్నారని, నాయీబ్రాహ్మణుడు కాని వ్యక్తి తనకు సంబంధం లేని వృత్తి అయిన సెలూన్‌ను కార్పొరేట్ స్థాయిలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వారు ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్‌కు తెలిపారు.

కొత్తగా కార్పోరేట్ తరహాలో సెలూన్ ఏర్పాటు చేయడం ద్వారా తమ కులవృత్తిని దెబ్బతీసేందు కు సదరు వ్యక్తి కుట్రలు చేస్తున్నాడని, ఈ కుట్రలను అడ్డుకొని తమ పొట్ట కొట్టకుండా న్యాయం చేయాలని వారు ఆది శ్రీనివాస్‌ను కోరారు. కార్పొరేట్ స్థాయిలో సెలూన్ షాపు ఏర్పాటు చేస్తే జీవనోపాధి కరువై వందలాది కుటుంబాలు రోడ్డున పడాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వేములవాడ పట్టణ నాయీబ్రాహ్మణ ఓనర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం నవీన్, గంగిపెల్లి చిరంజీవి, సారంపెల్లి సంతోష్, ఇన్నారం రమేష్, వెలిచాల శ్రీకాంత్, ఇన్నారం సాగర్, గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు



గంభీరావుపేట సెప్టెంబర్ 24: ఎన్నికలలో ఇచ్చిన హామీలను సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు అన్నారు, మంగళవారం రోజున గంభీరావుపేట మండలం శ్రీగాద గ్రామపంచాయతీ ఆవరణలో గ్యాస్ సిలిండర్‌ల సబ్సిడీ మంజూరి సమాచార పత్రాలను లబ్ధిదార్లకు పర్శ హన్మాండ్లు అందజేశారు, ఈ సందర్భంగా పర్శ హన్మాండ్లు మాట్లాడుతూ ఇచ్చిన హామీల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ,మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, జీరో కరంట్ బిల్, 500 రూపాయలకే ఎల్ పీ జీ సిలిండర్, రైతు రుణమాపి అమలు చేసిందని అక్టోబర్‌లో కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరి ప్రారంభం అవుతున్నాయని అన్నారు, అన్ని ప్రభుత్వ పథకాలలో అర్హులందరికీ న్యాయం జరుగుతదని ఎవరు కూడా బాధపడవద్దన్నారు, ఇదీ ప్రజా పాలన ప్రభుత్వమని పర్శ హన్మాండ్లు అన్నారు, ఈ కార్యక్రమంలో బందెల రాజు, రవీందర్ రావు, కాశి, యాదగౌడ్, రంగా రావు, తిరుపతి రావు ,రాణి, చంద్రకళ, స్వామి ,రాం చందర్ రావు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్లకు సన్మానం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 24: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ ఏఎంసీ పాలక వర్గం డైరెక్టర్లుగా నియమితులైన రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్ గ్రామాలకు చెందిన నారాయణరెడ్డి, సత్యానారాయణరెడ్డిలను కాంగ్రెస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. రైతులకు అందుబాటులో ఉండి సేవలను అందిస్తామని నూతనంగా నియమితులైన డైరెక్టర్లు నారాయణరెడ్డి, సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్, రాజిరెడ్డి, నాగిరెడ్డి, భగవంతరెడ్డి, సత్యారెడ్డి, సాయిప్రేమ్, పర్శరాములు, ఎల్లయ్య, బాబయ్య, తేజ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడిని తగ్గించుకోవాలి

వీర్నపల్లి, సెప్టెంబరు 24: విద్యార్థులు మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలని సైకలాజిస్ట్ డాక్టర్ ప్రవీణ్ సూచించారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో మానసిక సమస్యలపై మంగళవారం విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మానసిక సమస్యలను తెలుసుకొని వాటిని ఎదుర్కొనేందుకు ఎలా ఉండాలో ఆయన వివరించారు. మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలన్నారు. మనసు ప్రశాంతతతో మెదడు చురుగ్గా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల ఇన్చార్జి వైద్యాధికారి డా. చిరంజీవి, ఎమ్ఎల్‌హెచ్‌పి చైతన్య, పాఠశాల ప్రత్యేక అధికారి లింగవ్వ, హెల్త్ అసిస్టెంట్ బాబు, ఏఎన్ఎంలు సుస్మిత, సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకట్రావుపల్లెకు న్యాయం చేయాలి

ఇల్లంతకుంట, సెప్టెంబరు 24: మండలంలోని వెంకట్రావుపల్లెకు న్యాయం చేయాలని గ్రామస్థులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2018లో గ్రామపంచాయతీ ఏర్పడిందని అప్పటి నుంచి గ్రామానికి సరిహద్దులు ఉన్నాయన్నారు. ఇటీవలే కొత్త గెజిట్ వచ్చిందని మార్పులు చేశారని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన ఓటర్లను తొలగించారని పేర్కొన్నారు. సమస్యలను వివరిస్తు కలెక్టర్‌కు వినతిపత్రం ఇప్పటికే సమర్పించినట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 24: మండలంలోని దుమాల గ్రామంలో ఇటీవల ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన యువకుడు న్యాలకొండ రాకేశ్‌రెడ్డి కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ వాట్సాప్ గ్రూప్ సభ్యులు, పలువురు దాతలు సమకూర్చిన 87,100 రూపాయలను మంగళవారం స్థానిక నాయకులు అందజేశారు. కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రజితశ్రీనివాస్‌గౌడ్, నాయకులు బాలకిషన్, నర్సింహారెడ్డి, సంజీవరెడ్డి, శంకర్, హన్మంతు, హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ వాట్సాప్ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన

చందుర్తి,సెప్టెంబరు 24: యాసంగి పంటలసాగుపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా కంది, పెసర, మినుములు వంటి పంటల యాజమాన్య పద్ధతులపై వ్యవసాయ నిపుణుల ఆధ్వర్యంలో రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దుర్గరాజు, ఏఈఓ లు రమ్య, శారద,యోగేశ్వర్ రైతులు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందజేత

బోయినపల్లి, సెప్టెంబరు 24: విద్యుత్ షాక్‌తో రైతుకు చెందిన గొర్రెలు మృతిచెందగా సెస్ సంస్థ నుంచి బాధిత రైతుకు నష్టపరిహారం సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, ఏఈ ప్రశాంత్ అందజేశారు. మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన పోలే కొమురయ్యకు చెందిన రెండు గొర్రెలు విద్యుత్ షాక్ తో మృతిచెందగా సెస్ నుంచి బాధిత రైతుకు రూ 14 వేల నష్ట పరిహారం చేసినట్లు డైరెక్టర్ తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

కోనరావుపేట, సెప్టెంబరు 24: ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పూజం కార్తీక్ అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఏబీవీపీ కార్యకర్తల సమావేశం అనంతరం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న 75 వేల కోట్ల స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని కోరారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్ రాక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

మిడ్ మానేరుకు ప్రారంభమైన ఇన్ ఫ్లో

బోయినపల్లి, సెప్టెంబరు24: శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టు కు మళ్ళీ ఇన్ ఫ్లో మంగళవారం ప్రారంభమైంది. ఎస్సారెస్పీ నుంచి ఆరు వేలు మూలవాగు, మానేరు వాగు, వరద కాలువ ఇన్ లెట్స్ ద్వారా 2200 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 316.72ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 24.33 టీఎంసీల మేరకు నిల్వ ఉంది.

మంచినీటి నాణ్యత..క్లోరినేషన్‌పై శిక్షణ

తంగళ్లపల్లి, సెప్టెంబరు 24: మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో తంగళ్లపల్లి మండలంలోని గ్రామ పంచాయితీ మంచినీటి సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం ఏరాటు చేశారు ఈ సందర్భంగా మంచినీటి నాణ్యత క్లోరినేషన్ చేయు విధానం తదితర అంశాలపై శిక్షణను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ సి ఈ అమరేందర్, గ్రిడ్ ఈఈ విజయ్ కుమార్, గ్రిడ్ ఏఈ అభిషేక్, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీవో మీర్జా తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం వితరణ

ముస్తాబాద్, సెప్టెంబరు 24: మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో పర్శ రాజయ్య మరణించగా కుటుంబానికి మిత్రాసేన యూత్ సభ్యులు పుల్లూరి రమేశ్, నిరంజన్ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యాన్ని వితరణ చేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు.

ప్రధాని మోదీ ద్వారానే దేశం సుభిక్షం

ముస్తాబాద్, సెప్టెంబరు 24: ప్రధాని నరేంద్రమోదీ ద్వారానే దేశం సుభిక్షంగా ఉంటుందని ముస్తాబాద్ మండల బీజేపీ అధ్యక్షుడు మెర్గు అంజాగౌడ్ పేర్కొన్నారు. మండల నామాపూర్ గ్రామంలో జాతీయ పార్టీ ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు మెర్గు అంజాగౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజాగౌడ్ మాట్లాడుతూ బీజేపీ సభ్యత్వాన్ని మహిళలు ఎక్కువగా స్వీకరించడం ఆనందంగా ఉందన్నారు. బీజేపీ ద్వారానే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుండవేని తిరుపతి, గూడెపు మధు, గుగ్గిళ్ల శివ, పాల్గొన్నారు.

కోనరావుపేట: భారతీయ జనతా పార్టీని, ప్రధానమంత్రి మోదీని ప్రజలు ఆదరిస్తున్నారని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బాలాజీ అన్నారు. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో బీజేపీ సభ్యత్వ కార్యక్రమాన్ని కొనసాగిస్తూ అనంతరం మాట్లాడారు. కోనరావుపేట మండలంలో భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు చురుకుగా కొనసా గుతుందన్నారు. ప్రధానమంత్రి న రేంద్రమోదీ పాలన ను ప్రజలు ఆదరి స్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజే పీ నాయకులు అభిలాష్, రాజేష్ తది తరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఆందోళన

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 24: సిరిసిల్ల తహసీల్దార్ ఎదుట బీఆర్ఎస్ నాయకులు మంగళవారం రాత్రి ఆందోళన చేశారు. రేషన్ డీలర్లుగా ఎంపికైన కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుల బంధువులకు సంబంధించిన ప్రొసీడింగ్‌లు కాంగ్రెస్ నాయకులకు మంగళవారం రాత్రి సిరిసిల్ల తహసీల్దార్ కార్యాలయంలో ఓ అధికారి ఇవ్వడం చర్చనీయాంశం అయింది. తహసీల్దార్ కార్యాలయంలోకి మీడియా వెల్లడంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన సిరిసిల్ల పట్టణ మాజీ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ భర్తతో పాటు మరో ముగ్గురు అక్కడి నుంచి పరుగులు తీశారు. రాత్రి చీకట్లో ప్రొసిడింగ్‌లు ఇవ్వటం ఏంటని అధికారిని మీడియా ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు ఇచ్చాడు. తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న బీఆర్ఎస్ నాయకులు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిరిసిల్ల నియోజకవర్గం పరిధిలో రేషన్ డీలర్ల నియమకాలలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. రాత్రి పూట కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎందుకు వచ్చారని అన్నారు. రాత్రి సమయంలో ప్రొసీడింగ్‌లు ఇవ్వాల్సిన అవసరమేంటని కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి

- మున్సిపల్ కమిషనర్‌కు వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు కార్మికులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 24: మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్దతిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ అన్నారు. మంగళవారం ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో కమిషనర్‌కు కార్మికులు, నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోడం రమణ మాట్లాడుతూ పట్టణంలో పచ్చదనంతో పాటు పరిశుభ్రంగా ఉంచడం కోసం అనేక సంవత్సరాలుగా పారిశుధ్య పనులతో సేవలందిస్తున్నారని అన్నారు. పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని రూ. 25 లక్షల ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేయడానికి సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్‌లో పనిచేస్తున్న కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు సుల్తాన్ నర్సయ్య, నాయకులు రాజయ్య, దేవయ్య, శ్రీనివాస్, బాలయ్య, లక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.